క్లుప్తంగా

నివాళి



సెల్వంకు నివాళులు అర్పిస్తున్న రాజేష్

నారాయణవనం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కీళగరం ఎంపీటీసీ రవి సోదరుడు సెల్వం(54) మృతికి సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్ సంతాపం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న సెల్వం తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న నూకతోటి రాజేష్ గురువారం మధ్యాహ్నం కీళగరం దళిత వాడకు వెళ్లి సెల్వం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సెల్వం కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ సారకాయలు, జిల్లా కార్యదర్శి రాకేష్ కిరణ్, రాష్ట్ర వాణిజ్య సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, కార్యకర్తలు ఉన్నారు.

యూనిఫాం పంపిణీ



స్కౌట్స్ అండ్ గైడ్ యూనిఫాం పంపిణీ చేస్తున్న హెచ్ఎం రమణయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం హెచ్ఎం రమణయ్య స్కౌట్స్ అండ్ గైడ్ యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, విలువలను పెంపొందించడం కోసం స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్స్‌ను పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పీఎంశ్రీ నిధులు రూ.30 వేలతో స్కౌట్స్ అండ్ గైడ్ యూనిఫాం కొనుగోలు చేసి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ విజయ్‌కుమార్, గైడ్ కెప్టెన్ జయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానం చేస్తే కఠిన చర్యలు

శ్రీకాళహస్తి: బహిరంగ మద్యపానం చేస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి–1 టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. పట్టణంలోని జయరామరావువీధిలోని వైష్ణవ కోనేరు ప్రాంతాన్ని గురువారం సీఐ పోలీసులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో రాత్రి సమయాల్లో మద్యపానం చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, అలాగే ఎవరైనా చేస్తే తమ దృష్టికి తేవాలని స్థానికులను కోరారు. అనంతరం బహిరంగ మద్యపానం నిషేధం అంటూ ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

గేట్‌లో పూజకు 911వ ర్యాంక్



పూజ

వరదయ్యపాళెం: జాతీయస్థాయిలో నిర్వహించే గ్రాడ్యుయేట్ యాప్టిట్యూడ్ టెస్టింగ్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)లో వరదయ్యపాళెంకు చెందిన విద్యార్థిని కల్లూరు పూజ 911వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి ఏపీ దేవాంగ సంక్షేమ సంఘ నాయకులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దారు సుబ్రమణ్యం

నాగలాపురం: రేషన్ కార్డుదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని పిచ్చాటూరు తహసీల్దారు సుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూలకు సకాలంలో బియ్యం అందించాలన్నారు. బియ్యం పంపిణీ గతంలో 70 శాతం వరకు అందించేవారని, ఇక మీదట 90 శాతం కార్డు దారులకు నిత్యావసర సరుకులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని డీలర్లకు సూచించారు. అలాగే రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. కుటుంబ యాజమానితో పాటు కార్డులో పేర్లున్న సభ్యులంతా ఒకేసారి దగ్గరలో ఉన్న రేషన్ షాపుకు వెళ్లి ఈపాస్ మిషన్‌లో తమ వేలిముద్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రాయలసీమ సింహ గర్జన సభకు తరలి రండి

శ్రీకాళహస్తి: వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న రాయలసీమ సింహ గర్జన సభకు భారీగా తరలి రావాలని జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. గురువారం తొట్టంబేడు మండలంలోని చోడవరం, చేమురు, కాసరం, మామిడిగుంట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే సభకు భారీ ఎత్తున ప్రజలు హాజరు కావాలని కోరారు.అనంతరం హలో మాల–చలో తిరుపతి పోస్టర్లను ఆవిష్కరించారు.

స్వచ్ఛాంధ్ర కాదు.. మురుగాంధ్ర..!

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కొన్నిచోట్ల మాటల్లో తప్పితే చేతల్లో లేదనే విమర్శలొస్తున్నాయి. పల్లెటూళ్లలో పారిశుధ్య సమస్యలు తాండవిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. రేణిగుంట మండలం జీ.పాళెం పంచాయతీ పద్మానగర్‌లోలో తిష్ట వేసిన సమస్యలే ఇందుకు అద్దం పడుతున్నాయి. ఇక్కడ దాదాపు 500 కుటుంబాలు ఉంటున్నాయి. ఇక్కడి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాలనీని పాలకులు, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎటుచూసినా అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. స్వచ్ఛాంధ్ర మాటేమోగానీ దుర్గంధం చిమ్ముతూ మురుగాంధ్రకు ప్రతీకగా ఈ ప్రాంతాలు నిలుస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ మురుగు, పారిశుధ్య సమస్యల వల్ల రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ఇకనైనా పంచాయతీ అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించి మెరుగు పరచాలని స్థానికులు కోరుతున్నారు.



రేణిగుంట మండలం పద్మానగర్‌లోని మురుగు కాలువలో వేసిన వ్యర్థాలు





రేణిగుంట మండలం పద్మానగర్‌లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

నోటీస్ బోర్డు

గురుకుల స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సత్యవేడు: స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8, 9 తరగతుల్లో చేరికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. ప్రస్తుతం 5వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. అందుకోసం :httpr://mjpapbcwsoer.apcfrr.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ఏప్రిల్ 3 నుంచి ఉరుసు

నాయుడుపేట టౌన్ : పట్టణంలో ఉన్న హజరత్ అమీర్‌షావలీ దర్గా ఉరుసును ఏప్రిల్ 3 తేది నుంచి మూడు రోజులు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వారు గురువారం ముజావర్లు, యువకులతో కలిసి ఉరుసు ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ రాత్రి గంధం ఊరేగింపు, 4వ తేదీ తెల్లవారుజామున దర్గా వద్ద భక్తులకు గంధం పంపిణీ, రాత్రి పాట కచేరి, 5వ తేదీ మధ్యాహ్నం అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

స్టెమ్ ల్యాబ్ ప్రారంభించిన డీఈఓ



ఏర్పేడు మండలం పల్లం హైస్కూల్‌లో స్టెమ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ కేవీఎం కుమార్

ఏర్పేడు(రేణిగుంట): బెంగళూరు క్రై సంస్థ సహకారంతో తిరుపతి ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఏర్పేడు మండలం పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టెమ్ ల్యాబ్‌ను డీఈఓ కేవీఎం కుమార్ ప్రారంభించారు. పిల్లల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్‌పై ఆసక్తి పెంచడమే లక్ష్యంగా రూ.7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. డీఈఓ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి ఎంతో ఉపయోగకరమైన స్టెమ్ ల్యాబ్‌ను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడిబయట పిల్లలు, బాల కార్మికులు, బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రగతి సంస్థ కృషి చేస్తోందని, ఏర్పేడు మండలంలోని అనేక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు విలువైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం సైన్స్‌లో ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ, ఎంఈఓ ప్రేమలత, హెచ్ఎం తీగల ఆనంద్, ప్రగతి ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.నారాయణ, రాజ్ కుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మమత, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్లు శిరీష, ప్రభాకర్, జయలక్ష్మి, సుభోష్, సిబ్బంది వెంకటేష్, మురగయ్య, రామచంద్ర, సురేష్, రాజేశ్వరి, సుమలత పాల్గొన్నారు.

శ్రీవాణి కుటుంబాన్ని ఆదుకోవాలి



శ్రీవాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగలాపురం: పిచ్చాటూరులో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న శ్రీవాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం పిచ్చాటూరులో జరిగిన శ్రీవాణి అంత్యక్రియల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సీఐటీయూ నాయకులు వెలుగు రమేష్, నాగరాజు, ఆరు వెంకటేష్, రామచంద్ర రెడ్డి, మునిశంకర్, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి రాజేశ్వరి, ఇంద్రాణి, శ్రీవాణి పాల్గొని ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు సంతాప సమావేశం ఏర్పాటు చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్తగా విశేషంగా సేవలందించిన శ్రీవాణి అకస్మాత్తుగా మరణించడం యూనియన్‌కు, అంగన్‌వాడీ రంగానికి తీరని లోటని తెలిపారు. సీఐటీయూ యూనియన్‌గా పిచ్చాటూరు మండలంలో సెక్టారు లీడరుగా, ప్రాజెక్టు నాయకురాలిగా, అంగన్‌వాడీ కార్యకర్తల హక్కుల కోసం జీతభత్యాల కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. శ్రీవాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయాల అద్దె తగ్గించండి



డీఎల్‌పీఓ ప్రభురెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏర్పేడు చిరు వ్యాపారులు

– డీఎల్‌పీఓకు చిరు వ్యాపారుల వినతి

ఏర్పేడు(రేణిగుంట): రేణిగుంట–నాయుడుపేట ఆరులేన్ల జాతీయ రహదారి విస్తరణ వల్ల మండల కేంద్రమైన ఏర్పేడులో వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయాయని, పంచాయతీ వాణిజ్య సముదాయ గదుల అద్దెలను తగ్గించాలని చిరు వ్యాపారులు గురువారం డీఎల్‌పీఓ ప్రభురెడ్డిని శ్రీకాళహస్తిలోని ఆయన కార్యాలయంలో కోరారు. తిరుపతి– శ్రీకాళహస్తి జాతీయ హైవే ఏర్పాటు, ఏర్పేడు–వెంకటగిరి మార్గంలో ఏర్పేడు వద్ద ఆర్‌టీబీ ఏర్పాటుతో వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పూర్తిగా ఏర్పేడులో వ్యాపారాలు లేవని, ఐఐటీ, ఐజర్ భవనాల నిర్మాణాల కార్మికులు సైతం నిర్మాణాలు పూర్తి కావటంతో సొంతరాష్ట్రాలకు వెళ్లిపోయారన్నారు. తాము రూ.వేలల్లో ఉన్న అద్దెలు చెల్లించలేమని ఆయనకు నివేదించారు. అలాగే, ఏర్పేడు సర్పంచ్ నల్లపాల్యం శివయ్యను అద్దెలు తగ్గించి తమ కుటుంబాలు వీధిన పడకుండా కాపాడాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వ్యాపారులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

● ఇంటి పట్టాలివ్వాలంటూ వినూత్న నిరసన



బుచ్చినాయుడుకండ్రిగ మండలం, కనమనంబేడు గ్రామ దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఇంటి పట్టాలివ్వాలంటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తొమ్మిదో రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నంబర్లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాల కోసం స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. – బుచ్చినాయుడుకండ్రిగ

రోడ్డుకు అడ్డంగా ట్రాలీ



యానాదివెట్టు వద్ద ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాక్టర్ ట్రాలీ

వరదయ్యపాళెం: సత్యవేడు–కడూరు కూడలి ప్రధాన రోడ్డు మార్గంలో మోకాలిలోతు గుంతలు పడడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల తైలం కొయ్యిల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ యానాదివెట్టు వద్ద గుంతలోకి దిగడంతో ట్రాలీ కూలబడింది. ఏకంగా ట్రాలీ చక్రాలు రెండూ విరిగి పక్కకు చేరాయి. దీంతో కొయ్యిలను మరో ట్రాలీలోకి బదిలీ చేసి పంపించారు. కూలబడిన ట్రాక్టర్ ట్రాలీని మాత్రం రాతిబండలపై రోడ్డు పక్కనే నిలబెట్టారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా రాత్రివేళల్లో వాహనదారులు రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాక్టర్ ట్రాలీ కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు రాత్రి సమయాల్లో ట్రాలీని గుర్తించక ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. పోలీసులు గానీ, ఆర్అండ్‌బీ అధికారులు గానీ స్పందించి రోడ్డుకు అడ్డంగా నిలబెట్టిన ట్రాలీని ఆ ప్రాంతం నుంచి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కరకంబాడి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగులోకి వచ్చిందని రేణిగుంట అర్బన్ పోలీసులు గురువారం రాత్రి తెలిపారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉబ్బిపోయి దుర్వాసన చిమ్ముతోంది. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉండవచ్చని, మృతుడెవరనేది తెలియరాలేదని ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

నాయుడుపేట టౌన్ : ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గురువారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 2023–24లో మొత్తం రూ.10.19 కోట్లు ఖర్చు చేసి 535 పనులు చేసినట్లు తెలిపారు. వీటిపై సోషల్ ఆడిట్ సిబ్బంది ఈనెల 1 నుంచి 17 వరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. కూచివాడ గ్రామంలో స్వర్ణముఖి నదిలో నిబంధలనకు విరుద్ధంగా రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేసి ఉపాధి పనులు చేసినట్లు తేలిందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు. అనంతరం రికార్డులు సక్రమంగా రాయకపోవడం తదితర కారణాలతో ఏపీవో, ఎఫ్ఏలు, టీఏలు, ఈసీ, సిబ్బందికి రూ.20,426 జరిమానా విధించారు. రూ.61,260ల రికవరీకి ఆదేశించారు. ఎంపీడీవో సురేష్‌బాబు, సోషల్ ఆడిట్ అధికారులు, ఉపాధి హామి ఎఫ్ఏలు, టీఏలు, ఈసీ పాల్గొన్నారు.

శివయ్యా! గుడికి వెళ్లే దారేదయ్యా..?



ఆలయానికి వెళ్లే మార్గంలో కనబడని సూచిక బోర్డులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వెళ్లే మార్గాన్ని తెలిపే సూచిక బోర్డులు మచ్చుకైనా కనపడటం లేదు. ఇక నాయుడుపేట, చెన్నై, తిరుపతి నుంచి వచ్చే భక్తులకు బైపాస్ రోడ్డులో సరైన సూచిక బోర్డులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పొన్నాలమ్మ సర్కిల్ వద్ద గతంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రతిమతో ఏర్పాటు చేసిన ఆలయ మార్గ సూచిక బోర్డును కూడా తొలగించారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు అగచాట్ల నడుమ చేరుకోవాల్సి వస్తోంది. ఈ ఇక్కట్లు లేకుండా బైపాస్‌రోడ్డులో ఏపీ టూరిజం వద్ద, నంది సర్కిల్, బుచ్చినాయుడుకండ్రిగ నుంచి ఎంజీఎం సర్కిల్ వద్ద ఆలయానికివ వెళ్లే దారి, దూరం తెలిపే బోర్డులు ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని భక్తులు కోరుతున్నారు. పాలకులు తమ ప్రచార యావతో ఫ్లెక్సీలు వేయడం తప్పితే భక్తుల కష్టాలను పట్టించుకోవగడం లేని పలువురు మండి పడుతున్నారు.

వితంతు పించను దేవో భవ!



“భర్తలు చనిపోయి నెలలు గడుస్తోంది.. కుటుంబపోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. పింఛన్ వస్తే కాసింత సాయం అవుతుందని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. వితంతువులనే దయ కూడా లేదు.. ఎన్నోసార్లు ఎంతో మందిని పింఛన్ మంజూరు చేయండి సారూ అని కోరుతున్నా కనికరించడం లేదయ్యా..., మాలాంటి దిక్కులేని వారంటే మీ అధికారులకు ఇంత చిన్నచూపా సామీ.. జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇంటికి ఆధారమైన భర్త చనిపోయాడంటే తరువాత నెలలో భార్యకు పింఛన్ ఇచ్చేవారు. కానీ చంద్రబాబు వచ్చినప్పటి నుంచి ఎవరూ పట్టించు కోవడం లేదు. ఇకనైనా దయ చూపి పింఛన్ ఇవ్వండి సారూ..'' అంటూ బుచ్చినాయుడుకండ్రిగ మండలం తలారివెట్టు గ్రామానికి చెందిన వాణి, సుగుణమ్మ, గుర్రమ్మ తమ ఆవేదన వ్యక్తం చేశారు. వితంతు పింఛన్ మంజూరు చేయాలని గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. – బుచ్చినాయుడుకండ్రిగ

వనరాజా కోళ్లు పంపిణీ



ఊరందూరులో వనరాజా కోళ్లను పంపిణీ చేస్తున్న పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు దళితవాడలో గురువారం తిరుపతి శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అఖిల భారత సమన్వయ కోళ్ల పరిశోధన ప్రాజెక్టులో భాగంగా వనరాజా కోళ్లను పంపిణీ చేశారు. దళితవాడకు చెందిన 32 మందికి, ఒక్కొక్కరికి 8 వనరాజ కోళ్లు, దాణా, మందులు, నీటి తొట్టె, పంజరాన్ని డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిశోధన ఫలాలు రైతుల వద్దకు చేర్చడమే లక్ష్యంగా తాము కోళ్లను పంపిణీ చేశామన్నారు. తక్కువ ఖర్చుతో పెరటి కోళ్ల పెంపకం ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. తిరుపతి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య మాట్లాడుతూ, వన రాజా కోళ్లు వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉండడంతోపాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. కోళ్ల శాస్త్ర విభాగధిపతి డాక్టర్ షకీలా మాట్లాడుతూ, ఆర్థిక ప్రయోజనం కోసం కోడి పెట్టలను ఒకటిన్నర సంవత్సరం, పుంజులను 14 నుంచి 16 వారాల వయస్సు వచ్చే వరకు పెంచాలన్నారు. ఒక కోడి పెట్ట ఏడాదిలో 160 గుడ్లను పెడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాంబాబు నాయక్, డాక్టర్ శ్రీకాంత్ బాబు, డాక్టర్ ఊహ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

–ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న చిట్టత్తూరు గ్రామ అరుంధతి వాడ గ్రామస్తులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామ అరుంధతి వాడ సర్వే నంబర్ 152–23 లో 0.04 సెంట్ల భూమి ఉంది. ఇది గ్రామకంఠం. ఈ స్థలాన్ని అంగన్వాడీ స్కూల్ నిర్మాణానికి కేటాయించారు. దీనిని గత ప్రభుత్వ పాలనలో టీడీపీ నేతలు కబ్జా చేశారు. అప్పట్లో దీనిపై స్థానికులు 'స్పందన' కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించారు. ఆ స్థలానికి హద్దులు ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ టీడీపీ నేతలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ గురువారం గ్రామపెద్దలు ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.